నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 26 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

హ్యాపీ క్రిస్మస్

మంచిర్యాల అర్బన్ : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

● ఊరూరా ఘనంగా వేడుకలు ● చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు, బైబిల్ పఠనం
● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శాంతిదూత యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా బుధవారం ఊరూరా క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో చర్చిలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేయగా, పాస్టర్లు దైవ సందేశాన్ని అందించారు. హ్యాపీ క్రిస్మస్.. మేరీ క్రిస్మస్.. అంటూ క్రీస్తును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులంతా కలిసి విందు చేసుకున్నారు. ఆయాచోట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. - నమస్తే నెట్‌వర్క్

లక్షెట్టిపేట సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఆధిపత్య పోరు.. ప్రొటోకాల్ కరువు

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఎంపీని పట్టించుకోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు

● వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం.. మిగిలిన ఎమ్మెల్యేలకు ఇష్టం లేదా..
● పెద్దపల్లి ఎంపీకి తలనొప్పిగా మారిన వ్యవహారం..!
● బెల్లంపల్లిలో సొంత పెదనాన్న వినోద్ సైతం ఎంపీ కార్యక్రమాలకు దూరం
● ఆసక్తిగా మారిన 'హస్తం' రాజకీయం

మంచిర్యాల, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అధికార హస్తం పార్టీలో ఆధిపత్య పోరు ముదిరి పాకాన పడుతున్నది. మంచిర్యాలలో జిల్లాలో గడ్డం వివేక్‌కు మంత్రి పదవి ఇవ్వడం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యేలకు ఏ మాత్రం ఇష్టం లేదని తెలుస్తున్నది. మంచిర్యాల జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దవాఖాన ప్రారంభోత్సవం సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణను పిలవలేదని, ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీ అనుచరులే తీవ్రంగా మండిపడ్డారు. ఇకపోతే నిన్న మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా బెల్లంపల్లికి వెళ్లిన ఎంపీ వంశీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. ఈ సమయంలో ఎంపీ వంశీ పెదనాన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ సైతం నియోజకవర్గంలోనే ఉన్నారు. కానీ ఎంపీ కార్యక్రమానికి రాలేదు. దీంతో బెల్లంపల్లిలోనూ ఎంపీకి ప్రొటోకాల్ దొరకలేదనే చర్చ హాట్ టాపిక్‌గా మారింది. ఇకపోతే ఎంపీ వంశీ మంగళవారం పెద్దపల్లిలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తన విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. అఫీషియల్ గవర్నమెంట్ ఈవెంట్స్‌కి కూడా నాకు ఇన్విటేషన్ రావడం లేదంటూ చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్‌ల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి.. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. 'ప్రజలు నన్ను ఎన్నుకున్నారు. నేను ప్రజల కోసం పని చేస్తాను. ఎవరి పిలుపు కోసం ఎదురు చూడను' అంటూ స్పష్టం చేశారు. ఈ రోజు కూడా ధర్మపురిలో కార్యక్రమాలు ఉన్నాయి కానీ నాకు ఇన్విటేషన్ రాలేదంటూ మాట్లాడారు. కలెక్టర్ ఎవరి ఆదేశాల మీద పని చేస్తున్నారో తెలియదంటూ.. తాను మాత్రం ప్రజల కోసమే ఉన్నానంటూ చెప్పుకొచ్చారు. మంచిర్యాల, ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని ఇలా ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఎంపీ విషయంలో ప్రొటోకాల్ పాటించని ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయంటూ ఆ పార్టీ లీడర్లే చెబుతుండడం గమనార్హం.

ఎంపీ వంశీ విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రొటోకాల్ పాటించకపోవడానికి అసలు కారణం మంత్రి పదవి అని తెలుస్తున్నది. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చిన గడ్డం వివేక్ మంత్రి పదవి కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ప్రభుత్వంలో కాక కుటుంబానికి సముచిత స్థానం కల్పిస్తామంటూ పలుమార్లు ప్రకటించారు. ఇది పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే ఉన్న మంత్రితో పాటు ఎమ్మెల్యేలకు సైతం రుచించడం లేదనే చర్చ నడుస్తున్నది. మంత్రిపదవి కోసం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో పాటు బెల్లంపల్లి ఎమ్మెల్యే వివేక్ సోదరుడు గడ్డం వినోద్ సైతం పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో మొన్నటి దాకా మంచిర్యాల జిల్లా వరకే పరిమితమైన ఆధిపత్య పోరు.. ఇప్పుడు పెద్దపల్లి పార్లమెంట్ మొత్తం సోకినట్లు కనబడుతున్నది. మంత్రి పదవి వివేక్ రావడం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యేలకు ఇష్టం లేదని.. ప్రస్తుత పరిణామాలే స్పష్టం చేస్తున్నాయి. వివేక్‌కి మంత్రి పదవి ఇస్తే ఆయన కుమారుడు ఎంపీగా ఉండి పెద్దపల్లి మొత్తాన్ని వారి చేతుల్లోకి తీసుకునే ప్రమాదముందని అధికార పార్టీ ఎమ్మెల్యేలు భావిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గడ్డం సోదరుల్లో ఎవరికి మంత్రి పదవి వచ్చినా.. తమకు ఇబ్బందులు తప్పవనే ఆలోచనల్లో ఉన్నట్లు తెలుస్తున్నది. అదే జరిగితే మంత్రిగా ఉన్న తను పెద్దపల్లి పార్లమెంట్‌పై పట్టు కోల్పోయే ప్రమాదముందని మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు సైతం భావిస్తున్నారని, అందుకే మంత్రి పదవి విషయంలో ఆయన గడ్డం కుటుంబానికి సపోర్టు చేయడం లేదని సమాచారం. గతంలో

బెల్లంపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే వినోద్ లేకుండానే అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎంపీ వంశీకృష్ణ

మంత్రి పదవి విషయం లోనే తగ్గుతున్న ప్రియార్టీ..!

డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క టూర్ సందర్భంగా శ్రీధర్‌బాబు మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్‌కు మద్దతుగా మాట్లాడం సైతం దీనికి బలం చేకూరుస్తున్నది. పైగా పార్లమెంట్ పరిధిలోని మిగిలిన ఎమ్మెల్యేలు మంత్రి శ్రీధర్‌బాబుకు విధేయులేనని.. ఈ మేరకు అంతా ఒక్కటయ్యారని.. అందుకే ఎంపీకి ప్రాధాన్యం తగ్గిందని, ఆయన విషయంలో ప్రొటోకాల్ పాటించడం లేదనే ప్రచారం ఇప్పుడు హస్తం పార్టీలో అగ్గి రాజేస్తున్నది.

'కాక' కార్యక్రమాల విషయంలోనూ అదే జరిగిందా..

ఇకపోతే గడ్డం వెంకటస్వామి (కాక) జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించే విషయంలోనూ రాజకీయ జోక్యం జరిగిందనే చర్చ సైతం నడుస్తున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాక వర్ధంతిని అధికారికంగా నిర్వహించాల్సిందే. అలాంటిది ఓ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించకపోవడానికి కారణం రాజకీయ జోక్యమే అని గడ్డం ఫ్యామిలీ భావిస్తున్నట్లు ఉంది. అందుకే అగ్రకుల మైండ్‌సెట్‌తో ఉన్న కలెక్టర్ కుల పిచ్చితో పని చేస్తున్నారంటూ ప్రెస్‌మీట్‌లోనే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రొటోకాల్ విషయంలో ఇన్ని రోజులు గోప్యంగా సాగిన వార్ ఎంపీ వ్యాఖ్యలతో ఒక్కసారిగా రచ్చకెక్కింది. ఏది ఏమైనా ఎంపీ విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు కొందరు అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం అనేది సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయాలను పక్కనపెట్టి అధికారిక కార్యక్రమాల్లో ఆయనకు ప్రాధాన్యం ఇస్తే పార్టీకే మంచిదని పలువురు చెబుతున్నారు. మరి ఇప్పటైనా ఆధిపత్య పోరును పక్కనపెట్టి హస్తం పార్టీ లీడర్లు ఒక్కతాటి పైకి వస్తారా.. లేకపోతే ఇదే తరహాలో వ్యవహరిస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

బిల్లు కడితేనే మృతదేహం

● మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం నిర్వాకం ● మృతుడి కుటుంబ సభ్యుల ఆందోళన

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 25 : బిల్లుకడితేనే మృతదేహాన్ని అప్పగిస్తామంటూ ఓ ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం డిమాండ్ చేసిన ఘటన మంచిర్యాలలో బుధవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన కొంగ శ్రీనివాస్(45)కు మంగళవారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్చారు. రోగిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి క్రిటికల్‌గా ఉందని, వెంటనే వైద్యం అందించాలని, ఇందుకోసం రూ.1.80 లక్షలు అవుతుందని కుటుంబ సభ్యులతో ప్యాకేజీ మాట్లాడుకున్నారు. ఆ వెంటనే రూ.1.50 లక్షలు కట్టించుకున్నారు. చికిత్స ప్రారంభించిన 45 నిమిషాల తర్వాత శ్రీనివాస్ మృతి చెందాడని కుటుంబ సభ్యులకు తెలిపారు. బుధవారం ఉదయం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను కలిసి బిల్లు రూ.4.50 లక్షలు అయ్యిందని, మిగతా రూ. 3 లక్షలు కట్టి మృతదేహాన్ని తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. దీంతో షాక్‌కు గురైన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు డబ్బులు చెల్లించేది లేదని, ప్యాకేజీ రూ.1.80 లక్షలు అని చెప్పి.. ఇప్పుడేమో రూ.4.50 లక్షల బిల్లు ఎలా వేశారని, అంటే చనిపోయిన వ్యక్తికి వైద్యం చేశారా.. అంటూ ఆందోళనకు దిగారు. హాస్పిటల్ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ విషయం మీడియాకు తెలియడం.. పలు ఛానళ్లలో వార్తలు రావడం, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అప్రమత్తమైన యాజమాన్యం బాధిత కుటుంబ సభ్యులతో చర్చించి సెటిల్‌మెంట్ చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని అప్పగించడంతో కుటుంబ సభ్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని నెటిజన్లు కోరుతున్నారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

కౌటాల, డిసెంబర్ 25 : మండలంలో బుధవారం మనుస్మృతి దివస్‌ను బౌద్ధ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బుద్ధవిహార్ నుంచి ప్రాణహిత నది ఒడ్డున ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్రగా వెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి జలాభిషేకం చేశారు. అనంతరం ప్రాణహిత నది పుష్కర ఘాట్‌ల వద్ద మనుస్మృతి ప్రతులు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని బౌద్ధ మతస్తులు, మహర్‌లు, నేతకానీలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రాణహిత నది వద్ద కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ, మనుస్మృతి ప్రతులు దహనం చేస్తున్న బౌద్ధ సంఘం నాయకులు

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా చర్యలు

ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శేషారావు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ): రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా అన్ని రకాల నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కుమ్రం భీం ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్.శేషారావు ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా 4 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు(పీటీఆర్) ఏర్పాటు చేసి, 33/11 సబ్‌స్టేషన్‌లలోని 4 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.132 కేవీ ఈజ్‌గాం సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల మండలంలో ట్రాన్స్‌కోకు సంబంధించిన 132 కేవీ సబ్‌స్టేషన్ పనులు 75 శాతం చేపట్టామని, మిగిలిన పనులు ఫిబ్రవరి నెలాఖరు కల్లా పూర్తవుతాయని తెలిపారు. గడిచిన ఏడాది కాలంగా గరిష్ఠ డిమాండ్ ఉన్న సమయంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్)పై లోడ్ భారం ఎంత ఉందో టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకుంటామని, అందుకనుగుణంగా కొత్తగా 120 ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చుతామని, లోడ్ మేరకు 336 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతామని పేర్కొన్నారు. మెరుగైన, నాణ్యమైన, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పటిష్టపరుస్తామని, ప్రతీ 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అందిస్తామని తెలిపారు. మున్సిపాలిటీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా రింగ్ మెయిన్స్ వ్యవస్థను పటిష్ట పరుస్తామని పేర్కొన్నారు. కెరమెరి, దహెగాం, కౌటాల, సిర్పూర్(టీ) మండలాల్లో కెపాసిటర్ బ్యాంక్స్ అమర్చామని, 11 కేవీ ముత్యంపేట ఫీడర్‌లో లైన్ కెపాసిటర్స్ ఏర్పాటు చేశామని, దీంతో అధిక లోడు తలెత్తినప్పుడు లో వోల్టేజీ సమస్య తీరుతుందని వివరించారు. దవాఖాన, మెడికల్ కాలేజీలు, పోలీస్‌స్టేషన్లకు అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

శేషారావు

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

దహెగాం, డిసెంబర్ 25: క్రీడలతో యువకుల్లో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ తెండుగురే శ్యాంరావు అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో పార్టీ మండల ఉపాధ్యక్షుడు దందెర మల్లేశ్ ఆధ్వర్యంలో గిరివెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ మారుమూల గ్రామమైన గిరివెల్లిలో టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. క్రీడాకారులు స్నేహపూరిత వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలన్నారు. ఇక్కడ మాజీ సర్పంచ్ కారు రాజన్న, బీఆర్ఎస్ నాయకుడు కొండా రామ్‌ప్రసాద్, కాశిపాక రాజు, ఆవుల రాజ్‌కుమార్ యాదవ్, శోభన్, దాసరి నరేందర్, బబ్లూ, బుజాడి వెంకటేశ్, లంగారి శేఖర్, తదితరులున్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నియోజకర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఎదులాపురం, డిసెంబర్ 25 : హాస్టల్‌లో ఉండలేనని, తనను ఇంటికి తీసుకెళ్లాలని ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన జిల్లాలో చోటు చేసుకున్నది. కుటుంబీకుల వివరాల మేరకు.. ఆదిలాబాద్‌లోని ఎస్ఆర్ ప్రైమ్ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న మణికంఠ అనే విద్యార్థి హాస్టళ్లలో ఉంటున్నాడు. అయితే కుటుంబీకులు సెలవు వచ్చినా ఇంటికి తీసుకుపోవడానికి రాకపోవడంతో మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన హాస్టల్ వార్డెన్ విద్యార్థిని రిమ్స్‌కు తరలించారు. సాయంత్రం వరకు ఇంటికి తీసుకెళ్తామని చెప్పినప్పటికీ తమ కుమారుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబీకులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆ విద్యార్థి చికిత్స పొందుతుండగా, ప్రాణాపాయం ఏమి లేదని వైద్యులు పేర్కొన్నారు.

మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశంకు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ● మాజీ జడ్పీటీసీ హన్మండ్ల మల్లయ్య వర్ధంతి సభ
● బీఆర్ఎస్‌లో చేరిన మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశం

తిర్యాణి, డిసెంబర్ 25 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. తిర్యాణిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మాజీ జడ్పీటీసీ హన్మండ్ల మల్లయ్య వర్ధంతి కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ముందుగా హన్మండ్ల మల్లయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలకేంద్రంలోని 30 పడకల దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మల్లయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు విసిగిపోయి మాజీ డీసీసీబీ డైరెక్టర్ తోట వెంకటేశం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జడ్పీటీసీ హన్మండ్ల లక్ష్మి, ఆత్రం చంద్రశేఖర్, వెడ్మ కమల, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హన్మండ్ల జగదీశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్యం రాజయ్య, కాసం రాజయ్య, హన్మండ్ల శంకరయ్య, కిలిశెట్టి శంకరయ్య, గాయెంగి మల్లేశ్, బాదిరావు, బ్రహ్మం, తోట బాపు, బుర్ర మధూకర్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష

నస్పూర్, డిసెంబర్ 25 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపడుతున్న దీక్ష బుధవారం 16వ రోజుకు చేరుకున్నది. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలావుద్దీన్, రంగు వేణు, సుధాకర్, నాగరాజు, నిహార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

నాగసముద్రం చెరువును కాపాడండి

మాట్లాడుతున్న గ్రామస్తులు

దండేపల్లి, డిసెంబర్ 25: దండేపల్లి మండలంలోని నాగసముద్రం చెరువును కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. 15, 16,17 సర్వే నంబర్‌లలో చెరువు ఏర్పడ్డ నాటి నుంచి ప్రధాన రహదారి వరకు.. దాని సరిహద్దులు ఉండేవన్నారు. కొన్నేళ్ల క్రితం 15, 16వ సర్వే నంబర్‌లో గల భూమి ఆక్రమణకు గురైందని, ఈ విషయమై నీటిపారుదల శాఖ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేశామన్నారు. సంబంధిత అధికారులు కేవలం 17వ సర్వే నంబర్‌లోని భూమి సరిహద్దులు చూపెడుతున్నారని పేర్కొన్నారు. ఆక్రమణకు గురైన 15, 16 సర్వే నంబర్‌లో గల భూమిని సర్వే చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కడుపు నొప్పితో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

పార్వతి (ఫైల్)

జైనూర్, డిసెంబర్ 25 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం సాసిమెట్ట ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఆత్రం పార్వతి (12) బుధవారం కడుపునొప్పితో మృతి చెందింది. జాడుగూడ గ్రామానికి చెందిన ఆత్రం పార్వతి సాసిమెట్ట ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నది. పొలాల అమవాస్య పండుగకు ఇంటికి వచ్చింది. ఆపై జ్వరంతో పాటు కడుపు నొప్పి రావడంతో ఊట్నూర్‌లోని ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. మూడు వారాల క్రితం డిశ్చార్జి చేశారు. అప్పటి నుంచి ఇంటి వద్దే ఉంటున్నది. ఈ క్రమంలో బుధవారం కడుపునొప్పి తీవ్రమై మృతి చెందినట్లు బాలిక తండ్రి ఆత్రం భీంరావు, మామ రాజు తెలిపారు.

జాలర్లకు చిక్కిన మొసలి పిల్ల

మొసలి పిల్ల

హాజీపూర్, డిసెంబర్ 25 : ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేపల వలకు మొసలి పిల్ల చిక్కింది. ఎప్పటిలాగే జాలర్లు బుధవారం ఉదయం చేపల వేటకు వెళ్లారు. ప్రాజెక్టులో వలను విసిరి బయటకు చేపలు తీస్తుండగా, అందులో కిలో బరువు గల మొసలి పిల్ల ఉన్నట్లు జాలర్లు గుర్తించారు. అనంతరం తిరిగి మొసలి పిల్లను ఎల్లంపల్లి ప్రాజెక్టులో వదిలి పెట్టారు. ఇటీవల రాపల్లి గ్రామ శివారులోని ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌లో మొసలి పిల్ల దొరకడంతో ఫారెస్టు అధికారులు దానిని ప్రాజెక్టులో వదిలి పెట్టిన విషయం విదితమే. దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో మొసళ్లు బాగానే ఉండి ఉంటాయని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

పెద్దవాగులో అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు

పెద్దవాగు సమీపంలో పులి సంచారం

పాదముద్రలను గుర్తించిన అధికారులు

పెంచికల్ పేట్, డిసెంబర్ 25 : గుంట్లపేట గ్రామ శివారులోని పెద్దవాగు సమీపంలో పులి సంచరిస్తున్నది. బుధవారం చేపల వేటకు వెళ్లిన జాలరులు పులి పాద ముద్రలను గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారమందించారు. వారు అక్కడికి చేరుకొని అవి పులి పాదముద్రలేనని నిర్ధారించారు. పులి బొంబాయిగూడ పంట చేలల్లో నుంచి అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. ఎర్రగుంట,పోతపెల్లి, లోడ్‌పల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.